# బదులు మనిషి

మొదటిసారి అతనిని అరెస్టుచేసినప్పుడు అతనికి పదేళ్ళు వయస్సు. పనీ, పాటా లేక తిరిగే తుంటరి అని అతనిని అరెస్టుచేశారు.

జడ్జి సమక్షంలో అతడు తన సంగతి ఇలా చెప్పాడు.

"నా పేరు జీన్ ఫ్రాంకాయిస్ లెటూరు. బాస్టిల్లి భవనం[illegible] దీప స్తంభాలమధ్య కూచుని తంబూరా వాయించేవాడిదగ్గర నేను ఆరుమాసాల నుంచి వుంటున్నాను. అతనితో పాటు పాటలపల్లవి పాడుతూవుండేవాడిని. పాటలు అయిన తరువాత డబ్బులు అడుక్కునేవాళ్ళం. అతను యెప్పుడూ విపరీతంగా తాగుతూవుంటాడు. నన్ను చావా చితకాకొడుతూ వుండేవాడు. పోలీసులు నన్ను పట్టుకోవడానికి కారణంకూడా అదే. అంతకు పూర్వం నేను, ఒక బ్రష్షులు అమ్మేవాడిదగ్గర వుండేవాడిని. మా అమ్మ బట్టలు వుతికేపని చేసేది. ఆమెపేరు ఎడెలి. ఒకప్పుడామె, మారిట్ మార్టర్‌లో ఒక చిన్న భాగంలో ఎవరో ఒకతితో నివసించేది. ఆమె మంచి పనితనంగల మనిషి. హోటళ్లలో పనిచేసేవారి బట్టలను ఆమె వుతుకుతూ వుండేది. డబ్బు బాగా సంపాదించేది. ఆమెకు నేనంటే చాలా ఇష్టం. ఆదివారాలనాడు మాత్రం, తను విందులకూ డాన్సులకూ పోవడానికి నన్ను పెందలాడే నిద్రపుచ్చేది. తక్కినరోజులలో నేను లైబ్రరీకు వెళ్లి చదవడం నేర్చుకొనేవాణ్ణి.

ఇలా వుంటూవుండగా మావీధిలో రోజూ బీటుతిరిగే పోలీసుసార్జెంటు ప్రతిరోజూ మాయింటి కిటికీదగ్గర కొంతసేపు నిలుచుండేవాడు. అతడు అందంగానే వుండేవాడు. క్రిమియాయుద్ధంలో పోరాడినందుకు అతడికి ఒక మెడలుకూడా వచ్చింది. మా అమ్మ, అతడూ చాలాసేపూ ముచ్చటలాడుకుంటూ వుండేవారు. తరువాత కొన్నాళ్ళకు వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకున్నారు. అప్పటినుంచీ రోజులు మారిపోయాయి. అతడికి నేనంటే

యిష్టంవుండేదికాదు. మా అమ్మకికూడా నామీద యిష్టంలేకుండా చేసే వాడు. ఇద్దరూకూడా నన్ను కొడుతూవుండేవారు. అంచేత ఇంట్లో దెబ్బలు తప్పించుకోడానికి నేను తోటలలోను తోపులలోనూ తిరుగుతూవుండే వాణ్ణి. ఇలావుండగా, అతిడి వుద్యోగంపోయింది. మా అమ్మకికూడా ఎక్కువపని దొరికేది కాదు. అంచేత ఆమె పనికోసం ఎక్కువగా తిరగ వలసి వచ్చేది. దానివల్ల ఆమెకు దగ్గు పట్టుకుంది. చివరకు ఆమె చచ్చిపో యింది. ఆమె చాలామంచిది పాపం! అప్పటినుంచీ నేను, బ్రష్షులు అమ్మే వాడిదగ్గరా, చెట్టుకింద పాటపాడేవారిదగ్గరా బ్రతుకుతూ వున్నాను. నన్ను ఇప్పుడు జైలుకుపంపిస్తారా ?"

పైమాటలన్నీ ఆ కుర్రాడు, వయస్సుముదిరిన పెద్దమనిషిలాగా దాపరి కంలేకుండా చెప్పాడు. వాడు, అరబ్బీలాగా వొదులుగా దుస్తులు తొడు క్కున్నాడు. మబ్బులాగ మొహంమీదపడిన జుట్టులో నుదురు అంతా కప్పుపడిపోయింది.

వాడికి 'నా' అన్నవా రెవరూ లేకపోయారు. కోర్టువారు వాణ్ని బోర్స్టల్ స్కూలుకు పంపించారు.

వాడు అట్టే తెలివిగలవాడుకాదు. కొంచెం సోమరికూడాను. వాడు నేర్చుకోగలిగిన పని అల్లా, గడ్డి కుర్చీలకు మెత్తలు అల్లడం. అయితేనేం, అధికారులకు చాలా అణకువగా వుండేవాడు. నెమ్మదయినవాడు. ఆ స్కూలులోవున్న ఇతర బాలురందరిలాగా దుర్గుణాలు ఏమీ అలవరచుకో లేదు. పదిహేడో ఏట అతనిని ఆస్కూలులోనుంచి వదిలేశారు. మళ్లీ నిరా ధారుడయ్యాడు. పారిసు బజారులలో దిక్కూ, తెన్నూ లేక తిరగవలసి వచ్చింది. ఇదివరకు తనతోపాటు ఖైదుస్కూల్లో వున్నవాళ్లు చేస్తూవున్న నీచకార్యాలన్నీ చూశాడు. ఇలా కొన్నినెలలు యెలాగో గడిపాడు. ఒక షాపు కిటికీలోనుంచి రెండురొట్టెల్ని దొంగిలించిన నేరానికి అతనిని అరెస్టు చేశారు. ఒక సంవత్సరంశిక్ష విధింపబడింది. జైలులోవున్న రాజకీయ ఖయిదీలకు పరిచారకుడుగా పనిచేశాడు. వారంతాకూడా యువకులే. వారి

లోకల్లా ఒక పెద్ద వుండేవాడు. అతని దగ్గర చేరి అనేక విషయాలను వారు చర్చిస్తో వుండేవారు. జీన్ ఫ్రాంకాయిసుకు అర్థంకానిమాటలు ఏమేమో వారు తమలో తాము చర్చిస్తూవుండేవారు.

ఫ్రాంకాయిసు శిక్ష ఏడాది అయిపోగానే మళ్ళీ పారిసువీధులలో పడ్డాడు. ఈసారి ఎప్పుడూకూడా పోలీసులు ఇతనిమీద ఓకన్నుంచి చూస్తూవుండేవారు. పోలీసుస్టేషనులోని పెద్ద రిజిష్టరులో తన పేరు నమోదు అయివుందనీ, పోలీసులు తనమీద నిఘా వుంచారనీ తెలియకుండానే అతడు సంచరిస్తూవుండేవాడు. పోలీసు రిజిస్టరులో అతడు నేరగాడు అని స్థిరీకరించి వ్రాసివేశారు.

జైలునుంచి వచ్చినతరువాత రెండేళ్లు అతడు యెలాగో బ్రతికాడు. పేకాటలు ఆడి కొద్దో గొప్పో గెలుచుకొనీ, అమ్మకపుగుర్రాలను మార్కెట్టుదాకా తోలుకొనివెళ్లి యేదో సంపాదించుకునీ, ఎక్కడబడితే అక్కడ తిండితింటూ, ఎక్కడబడితే అక్కడపండుకుంటూ కాలంగడిపాడు. దారిని పోయే త్రాగుబోతులను కొంతమందిని దోచుకున్నారనే నేరంమీదపోలీసులు ఒకగుంపును పట్టుకున్నారు. ఆ గుంపులో ఇతడొకడు. తను ఆ నేరం చెయ్యలేదనీ, ఆ నేరం వాళ్లుచేసినా చెయ్యకపోయినా తనుమటుకు అందులో పాల్గొనలేదనీ, అతడు చెప్పుకున్నాడు. బహుశా, అది నిజమే అయివుంటుంది. కాని, పోలీసువారు ఇతనిమీదవున్న పాతరికార్డును కోర్టులో చూపెట్టారు. అతనికి మూడేళ్ళశిక్ష విధింపబడింది. ఈసారి జెయిలులో అతనికి ఒంటిమీద పచ్చబొట్టు పొడిచారు. తక్కిన నేరగాళ్ళు మాట్లాడే భాష ఇతనికి అలవడింది. ఏ నేరానికీ ఏశిక్ష పడుతుందో మొదలైన వివరాలన్నీ తెలుసుకున్నాడు.

జైలునుంచి బైటపడ్డాడు కాని, యీసారి అట్టే రోజులు స్వాతంత్ర్యవాయువు పీల్చలేదు. ఒక దోపిడికేసులో పట్టుపడ్డాడు. అతనితప్పు చిన్నదే కావచ్చు, అతని నేరం ఏమీ లేకపోవచ్చు. ఏమైతేనేం, నేరంలో పాల్గొన్నాడు. అయిదేళ్లశిక్ష పడింది. జెయిలుకు వెళ్ళేటప్పుడు, రెండు

మూడు నెలలుగా తను పెంచిన ఒకకుక్కను విడిచిపెట్టి వెళ్ళడానికి అతడు చాలా విచారించాడు.

అయిదేళ్ళు టూలన్ జెయిలులో వున్నాడు. సంకెళ్ళు, హార్బరులో పని, క్రరదెబ్బలు, దొంగలగుంపు మధ్య నిద్ర—ఇది అతడు ఆ అయిదేళ్ళూ అనుభవించింది. అతడు జెయిలునుంచి బైటికివచ్చేటప్పటికి యాభై-ఆరు ఫ్రాంకులు అతనివద్ద వున్నాయి, పోలీసు కాపలా తప్పించుకొని, పారిసు నగరానికి రహస్యంగా చేరుకన్నాడు. పాతస్నేహితులెవరూ కనపడలేదు. ఒక వృద్ధురాలియింట్లో, తనొక నావికుణ్ణని చెప్పి, ఎవరికీ తెలియకుండా బస ఏర్పరచుకున్నాడు.

ఒకరోజున వుదయం, బజారులో తిరగడానికి సాహసించి వెళ్ళాడు. దారిలో తాను చిన్నప్పుడు ఎప్పుడో చదువుకున్నస్కూలు అతనికంటబడింది. ఆ స్కూలుముందర అలాగే చాలాసేపు నిలుచుండిపోయాడు. చిన్నప్పటి రోజులన్నీ కళ్లముందు దృశ్యంలాకనపడ్డాయి. ఆస్కూలు గోడమీద "తప్పు చెయ్యని తొంభై తొమ్మిది మందికంటె, తప్పుచేసి పశ్చాత్తాపపడినవానికి స్వర్గసౌఖ్య మెక్కువ" అనే అర్థంవచ్చేవాక్యం వ్రాసివుంది. అది చదువుకున్నాడు జీన్ ఫ్రాంకాయిసు. అతని మనస్సులో ఏదో చలనం కలిగింది. దృష్టిముందు ఒక అపూర్వ తేజస్సు కనబడింది.

"నా వెంటబడి, నన్ను తరిమితరిమి ఎవరూ పట్టుకోకపోతే. ఏదో కూలి పనిచేసుకుని హాయిగా బ్రతకగలను, రోజుకు మూడు ఫ్రాంకులు సంపాదించుకున్నానంటే నాకు ఎక్కతొక్కినంత" అనుకున్నాడు.

అనుకున్నట్లుగానే అతడు వేరొక శ్రేణిలో జీవితం ప్రారంభించాడు. కూలిపని చేసుకొని, ఆ సంపాదనమీద బ్రతుకుతూవున్నాడు. కూలిపని చేసుకునే వాళ్ళమీద పోలీసువారి ఓరచూపులు అంతగా పడటంలేదని అతడు గ్రహించాడు. తనకు భయంలేదనుకున్నాడు. భయంలేకుండా, హాయిగా నిద్రపోయేవాడు.

ఎలాగయితేనేం, అతనికి ఇప్పుడొక స్నేహితుడుకూడా దొరికాడు. ఆ

స్నేహితుడి పేరు సావినియన్. అతనంటే జీన్ ఫ్రాంకాయిసుకు చాలా ప్రేమ కుదిరింది. ఇద్దరూ కలిసి చాలా దూరం షికారు వెడుతూ వుండేవాడు. ఇద్దరూ కలిసి హోటళ్ళలో తింటూ వుండేవారు. పల్లెటూరి జీవితాన్ని గురించి ఫ్రాంకాయిసు తన స్నేహితుడు చెప్పగా ఎంతో విన్నాడు. సావినియన్ ఎన్నో కథలను, ఫ్రాంకాయిసు యెన్నడూ విననివాటిని అతనికి చెప్పాడు. సావినియన్ పల్లెటూరినుంచి వచ్చినవాడు.

తన పూర్వోత్తరం సావినియన్‌కు ఏమయినా తెలిసిపోతుందేమోనని ఫ్రాంకాయిసు చాలా భయపడుతూ వుండేవాడు. అప్పుడప్పుడు మాటల ధోరణిలో, ఖయిదీల సహవాసంవల్ల తాను నేర్చుకున్న పాడుమాటలు పొర పాటున అనేవాడు. అతని మనస్సు యెంతో బాధపడేది.

సావినియన్‌కు పారిసునగరపు విలాసాలంటే అభిలాషకలుగుతూ వుండేది. ఫ్రాంకాయిసును పారిసు విలాసాలనుగురించి చెప్పమని అడిగేవాడు కాని, ఫ్రాంకాయిసు తనకేమీ తెలియదని చెప్పేవాడు.

మెల్లి మెల్లిగా సావినియన్, పారిసులోని భోగపుకొంపలకు వెళ్లడం సాగించాడు. ఫ్రాంకాయిసు కష్టపడి సంపాదించి, దాచుకున్నది ఏమైనా వుంటే, సావినియన్ బదులడిగి తీసుకొని తన విలాసాలకు ఖర్చుపెట్టేవాడు. ఆ డబ్బును మళ్లీ ఫ్రాంకాయిసు యివ్వాలనే సంగతి అతనికి జ్ఞాపకం వుండేదికాదు. ఫ్రాంకాయిసు యేమీ మాట్లాడక, ఇదంతా సహించి ఊరుకునేవాడు.

ఇలా ఉంటూవుండగా, ఆపర్నాట్ అనేవాడు ఒకడువచ్చి, వీళ్లిద్దరు వున్న గదిలోనే బసచేశాడు.

సాయంత్రం ఫ్రాంకాయిసు తన బసకు వచ్చి మెట్లు యెక్కుతూవుంటే, గదిలో ఆపర్నాట్, పెద్దగొంతుతో కోపంతో కేకలువేస్తూవుండటం విని పించింది. ఫ్రాంకాయిసు అలాగే నిలుచుని విన్నాడు.

ఆపర్నాట్ మాటలు ఇలా వినబడ్డాయి.

"ఎవరో నా పెట్టెతీసి మూడు లూయీలను దొంగిలించారు. పనిమనిషి

మేరియా అయినా కావాలి. లేదా ఈ గదిలోవున్న ఇద్దరిలో యెవరో ఒక రయినా కావాలి. వీళ్ళ పెట్టెలు పగలగొట్టిచూదాం, లేదా నేను పోలీసులకు రిపోర్టుచేసి నిన్నుకూడా కోర్టుకు ఈడుస్తాను. నా బంగారు నాణేలు నాకు గుర్తువున్నాయి. వాటిమీద నేను కొన్ని గుర్తులుకూడా పెట్టాను. రా, ఇవన్నీ వెతుకుదాం? లేదా నేను పోలీసుల్ని పిలుస్తాను."

పైమాటలకు, ఇంటి యజమానురాలి గొంతు యిలా జవాబుచెప్పింది.

"సరే, చూదాం. ఏవీ దొరకకపోతే, వాళ్ళు ఎలాగా మండిపడతారు. అదంతా నీ ఖర్మం."

ఈ మాటలు వినేటప్పటికి జీన్ ఫ్రాంకాయిసు శరీరం ఆ పాదమస్తకం కనిపించింది. సావినియన్ అప్పులు చేస్తూవుండడం, ఇటీవల కొన్నాళ్లనుంచీ అతడు ముచ్చులాగ మాట్లాడకుండా వుండటం అతనికి జ్ఞాపకం వచ్చింది. అయినా సావినియన్ యీ దొంగతనం చేసివుంటాడని ఫ్రాంకాయిసు అనుకోలేక పోయాడు. ఆవర్నాట్ లోపల పెట్టెలు తీసి వెతుకుతూవున్న చప్పుడు అతనికి వినిపించింది. దడదడ కొట్టుకొంటూవున్న గుండెల చప్పుణ్ణి అణిచిపెట్టడానికి కాబోలు ఫ్రాంకాయిసు తన రెండుచేతులను గుండెలమీద అదిమి పట్టుకున్నాడు.

"ఇవిగో నాణేలు. ఆ చిన్న దొంగ పెట్టెలో చూడు. నేను చెప్పిన గుర్తులు యీ నాణేలమీద ఉన్నాయో లేదో. ఆ చిన్నవాడిని మీరు జెయిలుకు పంపించితీరాలి" అని ఆవర్నాట్ అన్నమాటలు ఫ్రాంకాయిసుకు స్పష్టంగా వినిపించాయి.

ఇంతలో సావినియన్ మేడ మెట్లు ఎక్కివస్తూవున్న చప్పుడు ఫ్రాంకాయిసుకు వినిపించింది.

"అయ్యోపాపం! సావినియన్ గోతిలో పడిపోతున్నాడు. ఇంకా కొంచెం వ్యవధి వుందిలే" అనుకున్నాడు అతడు.

తలుపు దభాలున తెరుచుకొని లోపల ప్రవేశించాడు. అతని మొహాన కాంతి అన్న మాటలేదు. లోపల యింటి యజమానురాలు, దాసీది,

...యా ఉన్నారు.

...ంచండి. ఆ డబ్బు తీసినవాణ్ణి నేను. నా స్నేహితుడి పెట్టెలో పెట్టినదికూడా నేనే. చాలా తప్పే. దొంగను నేను, అతనుకాదు. నేను తప్పించుకోను. పోలీసులను పిలవండి. అయితే సావినియన్‌కు ఒక్క మాట చెప్పాలి. మీరు బయటికి వెళ్ళండి. అదిగో అతడు” అన్నాడు ఫ్రాంకాయిసు. ఈలోపలనే సావినియన్ అక్కడకువచ్చాడు. తన దొంగతనం బయటపడిందని గ్రహించి, నిర్విణ్ణుడై నిలుచున్నాడు.

సావియన్‌ను దగ్గరలాక్కుని 'మాట్లాడకు' అని దీనంగా చెప్పాడు ఫ్రాంకాయిసు.

“మేం మాట్లాడుకోవాలి. మీరు బయటికి వెళ్ళండి. కావలిస్తే బయట తాళం వేసుకోండి.” అని దబాయించి ఫ్రాంకాయిసు చెప్పిన మాటలకు, ఆ ముగ్గురూ బయటకు వెళ్ళారు.

“ఇదిగో చూడు భయపడకు. ఈ దొంగతనానికి శిక్ష ఆరునెలలే. కాని, ఒకసారి ఖైదుకు వెళ్ళినవాడు బాగుపడడు. నేను మొత్తంమీద పదహారు సంవత్సరాలు జెయిళ్లలో వున్నాను.

ఈ దొంగతనాన్ని నా నెత్తిన వేసుకున్నాను. నీకుబదులు నేను వెడతాను. నేను ద్వీపాంతరాన్నుంచి తప్పించుకొని వచ్చాను. నన్ను యెప్పుడైనా పట్టుకుపోవాళ్ళే. నిన్ను చాలా ప్రేమించాను. నీ స్నేహంవల్ల నేను చాలా హాయిని అనుభవించాను. ఇక యెప్పుడూ ఇలాంటి పని చెయ్యని మాటకు నాకు మాటయియ్యి. అంతేచాలు, అదుగో వాళ్లు వస్తున్నారు. దూరంగా పో, మనిద్దరికీ బాగాపరిచయంవున్నట్టు వాళ్లకు తెలియకూడదు” అని ఫ్రాంకాయిసు సావినియన్‌కు చెప్పాడు.

పోలీసులు వచ్చి ఫ్రాంకాయిసును పట్టుకొని పోయారు.

ఫ్రాంకాయిసును యావజ్జీవన ఖైదు శిక్ష విధింపబడింది.

(ఒక ఫ్రెంచి కథకు అనువాదం)